క్లుప్తంగా

పీఏసీఎస్ చైర్మన్‌గా నాగయ్య

ట్రిబ్యునల్ కోర్టు తీర్పుతో మళ్లీ బాధ్యతలు



పరకాల : పీఏసీఎస్ చైర్మన్‌గా నాగయ్య మళ్లీ పదవీ బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా కొనసాగిన అతను రూ. 13లక్షలు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై గతేడాది సెప్టెంబర్ 17వ తేదీన సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. కాగా నాగయ్య కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈనెల 05న ట్రిబ్యునల్ కోర్టు తీర్పు వెలువరించింది. నాగయ్య అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు లేవని, ఆయన సస్పెండ్‌ను ఎత్తివేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో ఆయన మళ్లీ పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, డైరెక్టర్‌లు తదితరులు అభినందించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

దామెర : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండలంలోని ల్యాదేళ్లలో మంగళవారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపినా, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్సై యాకయ్య, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు

హన్మకొండ: కేసీఆర్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలు నేటి (బుధవారం) నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 17 సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో బుధవారం ఉదయం 11 గంటలకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా కుమార్

హసన్‌పర్తి: వాకర్స్ అసోసియేషన్ 303 జిల్లా కమిటి సంయుక్త కార్యదర్శిగా హసన్‌పర్తికి చెందిన బొక్క కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ప్రకటించారు. నియమాకానికి సహకరించిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఆసియాకు గోల్డ్‌మెడల్

న్యూశాయంపేట : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఫోర్త్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో హంటర్‌రోడ్డులోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో బైపీసీ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని ఆసియా గోల్డ్‌మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం.నీరజ తెలిపారు. పోటీల్లో ఇండియా, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌కు చెందిన క్రీడాకారులు పాల్గొనగా వారితో తలపడి ఫైనల్స్‌లో విజేతగా నిలిచిందని పేర్కొన్నారు. ఆసియాను డీఎండబ్ల్యూఓ మురళీధర్‌రెడ్డి, ఆర్ఎల్‌సీ శ్రీనివాస్ అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన న్యాయవాది శివ

వరంగల్ లీగల్ : హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను తన కార్యాలయంలో న్యాయవాది గంధం శివ కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల తనపై దాడి చేసిన హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, ఇతర సిబ్బందిపై చర్య తీసుకోవాలని కోరారు.

కోర్టులో ఉచిత కంటి పరీక్షలు

వరంగల్ లీగల్ : హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ అగర్వాల్ నేతృత్వంలో జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్.రమేశ్‌బాబు ముందుగా కంటి పరీక్షలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇరు బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, బాధ్యులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో అభిషేకం

కాజీపేట: పట్టణంలో కొలువుదీరిన స్వయంభు శ్వేతార్కమూల గణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం స్వామివారికి నవధాన్యాలతో అభిషేకం నిర్వహించారు. పట్టణంలోని పుర వీధుల్లో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌తో పాటు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, సుధీర్‌తో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కలగానే స్వచ్ఛ పట్టణం..!



చెత్తాచెదారంలో పందుల స్వైరవిహారం



చెత్తను కాల్చుతున్న మున్సిపల్ సిబ్బంది

- 22 వార్డులకు 8 వాహనాలే దిక్కు
- మూలకు పడిన స్వచ్ఛ వాహనాలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- కంపు కొడుతున్న కాలనీలు

పరకాల : 22 వార్డులు.. 150 కాలనీలకు 10 స్వచ్ఛ వాహనాలతో పాటు నాలుగు ట్రాక్టర్ (ట్యాంకర్ -1) ఉండడంతో పారిశుద్ధ్య పనుల నిర్వహణ మున్సిపాలిటీ సిబ్బందికి సవాల్‌గా మారుతోంది. అసలే తక్కువ వాహనాలతో పారిశుద్ధ్య పనులకు ఇబ్బందిగా మారగా.. వాటిలో నాలుగు వాహనాలు మరమ్మతుకు చేరుకోవడంతో పట్టణంలో సేకరించిన చెత్తను తరలించకుండా కాలనీలోనే పేరుకుపోగా పందులు స్వైరవిహారం చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని వార్డుల్లో చెత్తను అక్కడే కాల్చి వేయడంతో పొగ కమ్ముకుంటోంది. పలు కాలనీవాసులకు చెత్తను ప్రధాన కూడళ్లలో పడేసి చేతులు దులుపుకొంటున్నారు. ఓ వైపు స్వచ్ఛమైన పట్టణంగా తీర్చిదిద్దుతామంటూ ప్రచారం చేస్తున్న మున్సిపల్ అధికారులు.. స్వచ్ఛ వాహనాల మరమ్మతుపై దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది.

ఆర్థిక భారం..

అయితే చెత్తను తరలించేందుకు ప్రైవేటు వాహనాలను రప్పిస్తుండడంతో మున్సిపాలిటీపై ఆర్థిక భారం పడుతోందని కొద్ది రోజుల క్రితమే ప్రైవేటు వాహనాలను నిలిపివేశారు. కాగా మున్సిపల్ వాహనాలను మరమ్మతు చేయించకపోవడం విడ్డూరంగా ఉందని పట్టణవాసులు ఆగ్రహిస్తున్నారు. కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి కంపు కొడుతుందని, విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



చెత్త తరలిస్తున్న ట్రాక్టర్లు (ఫైల్)

చెత్తను కాల్చుతున్న సిబ్బంది

ట్రాక్టర్‌లు రావడం లేదన్న కారణంతో పలు కాలనీల్లో పేరుకపోయిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది కాల్చివేస్తున్నారు. దీంతో వాతావరణం కాలుష్యం, పొగతో రోగాల బారిన పడుతున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు. పలు కూడళ్లలో విద్యాసంస్థలు, ఆర్టీసీ స్టాఫ్‌లు ఉండటంతో విద్యార్థులు, ప్రయాణికులు ఊపిరీ పీల్చుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



ప్రతీ ఏడాది పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రభుత్వం కోట్లాది రుపాయాలు ఖర్చు చేస్తోంది. ప్రజల ఆరోగ్యం, చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. మూలకుపడిన స్వచ్ఛ వాహనాలకు మరమ్మతులు చేయించాలి.

- సూర రాజేందర్, అధ్యాపకుడు, పరకాల

కమిషనర్ దృష్టిసారించేనా..!

స్వచ్ఛ వాహనాలు పనిచేయకపోవడంతో పట్టణంలో పేరుకుపోతున్న చెత్తాచెదారంపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ దృష్టిసారించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పట్టణ ప్రజల ఆరోగ్యం బాగుండాలంటే పారిశుద్ధ్య పనులు ముఖ్యమని, ఆయా పనులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అధికారులు కొంత నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛదనంపై చర్యలు చేపట్టాలంటున్నారు.

గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తే కేసులు

- ఎస్సై పరమేశ్

శాయంపేట : నిషేధిత గుట్కా, అంబర్ ప్యాకెట్లు విక్రయిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఎస్సై పరమేశ్ హెచ్చరించారు. మండలంలోని కొప్పులలో మంగళవారం శివ కిరాణంలో గుట్కా, అంబర్ ప్యాకెట్లు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో రూ. 3,024 విలువచేసే గుట్కా, అంబర్ ప్యాకెట్లు లభించినట్లు ఆయన తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గుట్కా, అంబర్ ప్రాణాంతకమని, విక్రయాలు, రవాణా మానుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తప్పవని అన్నారు.



సీజ్ చేసిన గుట్కా ప్యాకెట్లను చూపిస్తున్న పోలీసులు

మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం షురూ

- నమూనా ఇంటికి ముగ్గుపోసిన ఎంపీడీఓ

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా మోడల్ ఇల్లు నమూనా కోసం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఎంపీడీఓ ఫణిచంద్ర ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇల్లు నమూనాను పరిశీలించేందుకు ముగ్గుపోసినట్లు తెలిపారు. అర్హులైన అందరికీ ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రాసెస్ కొనసాగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నరేందర్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మోడల్ ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు పోయిస్తున్న ఎంపీడీఓ ఫణిచంద్ర

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రావుల లక్ష్మణ్‌రావు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతారాం, కుమారస్వామి పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సహకారం

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ : నగరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తామని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే స్పష్టం చేశారు. ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా హనుమకొండ సుబేదారి ఫారెస్ట్ ఆఫీసు ప్రాంతంలో మెప్మా సహకారంతో ఏర్పాటు చేసిన లహరి చపాతి మేకింగ్ యూనిట్‌ను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహిస్తున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓం శ్రీభద్రకాళి గ్రూపునకు చెందిన సభ్యుల విన్నపం మేరకు చపాతి తయారీ యూనిట్ ఏర్పాటుకు మెప్మా నుంచి ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని యూనిట్ విస్తరిస్తే అందుకు కావలసిన ఆర్థికసాయాన్ని బల్దియా అందిస్తుందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక ఎస్‌హెచ్‌జీలను ప్రోత్సహిస్తూ సబ్సిడీలు పొందేలా రుణాలను అందజేస్తూ సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, టీఎంసీ రమేశ్, కమ్యూనిటీ ఆర్గనైజర్ స్వాతి పాల్గొన్నారు.



చపాతి యూనిట్ నిర్వహణ సభ్యులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

'ఈటల' చిత్రపటానికి పాలాభిషేకం



ఈటల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులు

పరకాల : మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ చిత్రపటానికి పరకాల గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే బాధిత రైతులు మంగళవారం పాలాభిషేకం చేశారు. రైతుల జీవనాధారంగా ఉన్న పంట భూములను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు బహిరంగ మార్కెట్‌లో మార్కెట్ ధర కంటే మూడు రేట్లు అధనంగా చెల్లించాలని పార్లమెంట్‌లో ప్రస్తావించడం హర్షణీయమన్నారు. రామచందర్‌రావు, రాజిరెడ్డి, రాజ్‌కుమార్, స్వప్న, సతీశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మిత్రుల చేయూత

ఆత్మకూరు : తమతో చదువుకుని ఆపదలో ఉన్న తోటి మిత్రుల కుటుంబాలకు 1999–2000 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం చేయూనందించారు. అనారోగ్యంతో మృతిచెందిన వెల్దె భిక్షపతితో పాటు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సముద్రాల రోజ, మారేపల్లి బాబు కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి మిత్రులు చిమ్మని దేవరాజు, కాడబోయిన రమేశ్, ఆత్మకూరు కిరణ్‌చారి, బయ్య రామకృష్ణ, కంది నరేందర్‌రెడ్డి, ఎదులాపురం కిరణ్, విలాసాగరపు రాజ్‌కుమార్, ముంద్రాతి రాజేశ్, షరీఫ్, ఉప్పుల రాజేశ్‌తో తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

వలంటీర్లు అత్యుత్తమ సేవలందించాలి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి : ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అపద మిత్ర వలంటీర్లు అత్యుత్తమ సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతీ విహార్‌లో అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో 12 రోజుల పాటు నిర్వహిస్తున్న అపద మిత్ర వలంటీర్ల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఇతర శాఖల సమన్వంతో సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. హనుమకొండ జిల్లా అగ్నిమాపక అధికారి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అగ్నిమాపక అధికారి వెంకట సతీష్‌కుమార్, తహసీల్దార్ చల్లా ప్రసాద్, డీటీ రహీం, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి

న్యూశాయంపేట : దేశంలో మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కార్యాలయంలో పార్టీ శత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇటీవల దేశంలోని అనేక రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బీజేపీ ఓడించడంలో చతికిల పడిందన్నారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని అన్నారు. తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సదాలక్ష్మి, టి.భిక్షపతి, ఎల్లేష్, లక్ష్మణ్, రాములు, సారంగపాణి, రాజు, అశోక్, శంకర్ నాయక్, రాంచంద్రారెడ్డి, సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సేవలను వినియోగించుకోవాలి

కేయూ క్యాంపస్: తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీల అభివృద్ధికి విద్యాబోధన, పరిశోధనల పరంగా సేవలు వినియోగించుకునేందుకు ఇటీవల ఆచార్యుల ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంపుదల చేసినందుకు కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ బాధ్యులు, ఇతర రిటైర్డ్ ఆచార్యులు, ఓయూ, జేఎన్‌టీయూ రిటైర్డ్ ఆచార్యులు హర్షం వ్యక్తం చేశారు. 2019 యూజీసీ నిబంధనల ప్రకారం యూనివర్సిటీల్లో ఇంతకు ముందే 60 ఏళ్లకే ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ ఆచార్యుల జీఓ 3 ప్రకారం ఈఏడాది జనవరి 28 వరకు ఇప్పటికే 65 ఏళ్లు నిండని ఆచార్యులను సేవలను విద్యాబోధనకు, పరిశోధనలపరంగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర .ప్రభుత్వసలహాదారులు వేం నరేందర్‌రెడికి, ఎమ్మెల్సీ కోదండరామ్‌కు, విద్యాశాఖ సెక్రటరీ యోగితారానాకు, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ పురుషోత్తం, ఉన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలి

హన్మకొండ: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని, తల్లిదండ్రుల కల సాకారం చేయాలని కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో మోషన్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్ష రాయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మోషన్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తదితరులు హాజరై మాట్లాడారు.

'స్థానిక' ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



ధర్మసాగర్ : మాట్లాడుతున్న ఆర్డీఓ రాథోడ్ రమేశ్



కమలాపూర్ : ఆర్ఓలు, ఏఆర్ఓలకు శిక్షణ ఇస్తూ..



శాయంపేటలో..

- ఆర్డీఓ రాథోడ్ రమేశ్
- ఆర్ఓ, ఏఆర్ఓలకు శిక్షణ
- అవకతవకలకు తావివ్వొద్దని సూచన

ధర్మసాగర్ : రానున్న స్థానిక ఎన్నిక నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఆర్డీఓ రాథోడ్ రమేశ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆర్ఓ, ఏఆర్ఓలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ తిరుపతిరెడ్డి ఆర్ఓ, ఏఆర్ఓలకు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పాల్గొని పలు సూచనలు చేశారు. స్థానిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పనిచేయాలని సూచించారు. మండలానికి సంబంధించిన వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయనున్నట్లు తెలిపారు. అందులో ఆర్ఓ, ఏఆర్ఓలకు ఏలాంటి సందేహాలు ఉన్నా వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలియపరచాలని, సందేహాలను అధికారులు నివృత్తి చేస్తారని స్పష్టం చేశారు. తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, ఎంపీఓ అఫ్జల్, ఆర్ఓలు, ఏఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : రానున్న స్థానిక ఎన్నికల నిర్వహణపై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ ఫణిచంద్ర అధ్యక్షతన ఆర్ఓఎస్ స్టేజ్1, స్టేజ్2, ఏఆర్ఓఎస్‌లకు శిక్షణ కల్పించారు. ఈ అవగాహన సదసుకు పరకాల డీఎల్‌పీఓ షరీఫొద్దీన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధులను క్రమశిక్షణతో చేపట్టాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. ఎంఈఓ భిక్షపతి, ట్రైనర్స్ శ్రీనివాసాస్వామి, రాజారాం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు)లకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి శిక్షకుడు కె.భాస్కర్‌రెడ్డి పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల్లో చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీఓ గుండె బాబు, ఎంపీఓ రవి, ఆర్ఓలు, ఏఆర్ఓలు పాల్గొన్నారు.

పరకాల : స్థానిక సంస్థల ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, నడికూడ ఎంపీడీఓ చేతన్‌కుమార్ స్పష్టం చేశారు. స్థానిక రైతు వేదికలో పరకాల, నడికూడ మండలాలకు చెందిన స్టేజ్–1, స్టేజ్–2 ఎన్నికల అధికారులకు శిక్షణ కల్పించారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన కామగోని రాంబాబు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల కోడ్, నిబంధనలపై అవగాహన కల్పించారు. రెండు మండలాలకు చెందిన ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

వేలేరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు చొరవ చూపాలని ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు ట్రైనింగ్ అధికారి రవి ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, విత్‌డ్రా, గుర్తుల కేటాయింపు, అభ్యర్థి ఖర్చులు తదితర వివరాలను పకడ్బందీగా పరిశీలించాలని అన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

హసన్‌పర్తి: రక్తదానం సామాజిక బాధ్యత అని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి సూచించారు. నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నక్కలగుట్టలోని హెచ్‌డీఎఫ్ బ్యాంక్, లయన్స్‌క్లబ్, వరంగల్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విజయ్‌చందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మూడు నుంచి నాలుగు సార్లు రక్తదానం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 550 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కళాశాల కోశాధికారి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, లయన్స్‌గవర్నర్ వెంకట్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్ మేనేజర్ శివకుమార్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడు